క్లుప్తంగా

ఘనంగా గణపతి హోమం



స్వామివారికి గణపతి హోమం నిర్వహిస్తున్న పండితులు

ముమ్మిడివరం: గణపతి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా శనివారం అన్నంపల్లి వర సిద్ధి వినాయక స్వామివారి ఆలయంలో స్వామివారికి గణపతి హోమం, లక్ష గరిక పూజలు ఘనంగా నిర్వహించారు. పది మంది పురోహితుల వేద మంత్రోచ్ఛరణల మధ్య గణపతి హోమం, గరిక పూజ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామస్తులు, భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పురస్కార గ్రహీతకు సత్కారం

అమలాపురం రూరల్: ఇటీవల కలెక్టర్ మహేష్ కుమార్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న పీఈటీ పరమట విష్ణు ప్రసాద్‌ను వన్నె చింతలపూడి ముంగండ వారి పేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శనివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ ఎం.రాంబాబు, ప్రధానోపాధ్యాయురాలు సూర్యకుమారి, ఉపాధ్యాయులు జ్యోతి, స్కూల్ వైస్ చైర్మన్ లావణ్య, ఎం. శ్రీనివాస్, పి.నాగేశ్వరరావు, పాఠశాల స్థల దాత కుటుంబ సభ్యులు పద్మావతి, అమ్మాజీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ చేపట్టాలి

తాళ్లరేవు: మండల పరిధిలోని గాడిమొగ గ్రామ పంచాయతీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఉప సర్పంచ్ కొక్కిలిగడ్డ లోకేష్ డిమాండ్ చేశారు. శనివారం సీతారామపురంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో 120 పనులకు గానూ రూ.4.20 కోట్ల అభివృద్ధి పనులను నిబంధనలకు విరుద్ధంగా చేపట్టడంతో గ్రామానికి చెందిన కొందరు హైకోర్టును ఆశ్రయించారన్నారు. అయితే పంచాయతీ కార్యదర్శి వీజేవీ రమణ గతేడాది డిసెంబర్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో కోర్టు తీర్పు కారణంగా ఎటువంటి పనులు చేయడం లేదని, బిల్లులు చెల్లించడం లేదని చెప్పారన్నారు. అయితే కోర్టు తీర్పును ధిక్కరిస్తూ ఇటీవల రూ.60.91 లక్షలు నిధులు కాంట్రాక్టర్లకు చెల్లించారని ఆరోపించారు.

మాధవరాయునిపేటలో అన్నదానం

తాళ్లరేవు: స్థానిక మాధవరాయునిపేటలో ఏర్పాటు చేసిన గణేష్ మంటపం వద్ద శనివారం భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. గణేష్ యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సంతర్పణకు తాళ్లరేవు పరిసర ప్రాంతాలకు చెందిన అనేక మంది తరలివచ్చి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి గ్రామ పంచాయతీ పరిధి సింగరాయపాలెంలో జంపన సూర్యనారాయణ రాజు మెమోరియల్, జకార్‌రాజు చారిటబుల్ ట్రస్ట్ ఆర్గనైజర్ జంపన సుమన్ వర్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే అయితాబుత్తుల ఆనందరావు శనివారం ప్రారంభించారు. ఈ శిబిరంలో కిమ్స్ హాస్పటల్ వైద్యులు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులను అందించారు. కార్యక్రమంలో మెట్ల రమణబాబు, నల్లా స్వామి, దేశంశెట్టి లక్ష్మీనారాయణ, అశెట్టి ఆదిబాబు, వేణుగోపాలరావు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న జ్వరాలు

- దోమలతో ప్రబలుతున్న వ్యాధులు
- నిరుపయోగంగా ఫాగింగ్ మెషీన్లు
- గ్రామాల్లో లోపించిన పారిశుధ్యం



మురుగు, చెత్తా చెదారంతో నిండిపోయిన దేవగుప్తంలోని ఇందిరమ్మ కాలనీ



అల్లవరం వంతెన పక్కన చెత్తాచెదారం

అల్లవరం: గ్రామాల్లో ప్రజానీకానికి దోమలు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో చెత్తకుప్పలు దోమలకు ఆవాసాలుగా మారాయి. దోమలు ధాటికి ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో అధిక జ్వరాల కేసులు నమోదవుతున్నాయి. టైఫాయిడ్, మలేరియా, డెంగీ, సీజనల్ జ్వరాలు ప్రబలుతున్నాయి.

చర్యలు అంతంతమాత్రం

దోమలు విపరీతంగా పెరుగుతున్నా అధికారుల చర్యలు అంతంతమాత్రంగా ఉన్నాయి. మూడు నెలలుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నా పారిశుధ్యంపై చిత్తశుద్ధి లోపించింది. అల్లవరం మండలంలోని అన్ని పంచాయతీల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. రోడ్ల పక్కన చెత్తా చెదారం, డ్రైనేజీలు శుభ్రం చేయడం లేదు. డ్రైనేజీల నిర్వహణ లోపించడంతో మురుగునీరు నిల్వ ఉండిపోతోంది.

అలంకారప్రాయంగా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి పంచాయతీకి ఫాగింగ్ మెషీన్లు పంపిణీ చేశారు. వీటిని ఉపయోగించిన దాఖలాలు లేవు. కేవలం అలంకారప్రాయంగా పంచాయతీల్లో దర్శనమిస్తున్నాయి. చాలా పంచాయతీల్లో కనీసం ఒక్కసారి కూడా వినియోగించలేదంటే అధికారులు పనితీరు ఏపాటిదో అవగతమవుతోంది.

కనీసం బ్లీచింగ్ కూడా..

మూడు నెలలుగా కురుస్తున్న వర్షాలకు పల్లపు ప్రాంతాలు, రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉన్నా పంచాయతీల కార్యదర్శులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కనీసం బ్లీచింగ్ కూడా చల్లడం లేదని, దోమల మందును పిచికారీ చేయడం లేదని పలువురు మండిపడ్డారు. పల్లెల్లో జ్వరాలపై వైద్యారోగ్య శాఖ సర్వే నిర్వహించి, గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకూ పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి గ్రామాల్లో చెత్తా చెదారం తొలగిస్తాం. భారీ వర్షాల కారణంగా నీరు నిల్వ ఉంటే తక్షణమే చర్యలు తీసుకుంటాం. మురుగు గుంటల్లో మందు పిచికారీ చేయించి, ఫాగింగ్ యంత్రాల ద్వారా దోమల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. కలుషిత నీరు సరఫరా కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహిస్తాం.

– బొజ్జిరాజు, డీఎల్‌పీఓ, అమలాపురం

షరాబుల పందిరి లడ్డూకు వేలం



గణపతి లడ్డూను వేలంలో దక్కించుకున్న భక్తునితో బులియన్ అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక ముమ్మిడివరం గేటు సెంటరులో ఆది గణపతి వర్తక సంఘం ఆధ్వర్యంలో బులియన్ అసోసియేషన్ వినాయక చవితి సందర్భంగా నెలకొల్పిన షరాబుల చలువ పందిరిలో గణపతి మహాలడ్డూకు శనివారం రాత్రి వేలం పాట జరిగింది. బులియన్ అసోసియేషన్‌కు చెందిన బంగారం వ్యాపారి వీర్ని శేషు ఆ లడ్డూను రూ.39,900కు పాడుకుని దక్కించుకున్నారు. కార్యక్రమంలో బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్, బులియన్ అసోసియేషన్ కార్యదర్శి రాయుడు నాని, కోశాధికారి దొమ్మేటి సాయిబాబు, చింతలపూడి సత్తిబాబు, యర్రంశెట్టి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' ప్రైవేటీకరణను ప్రభుత్వం అడ్డుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణమూర్తి

అమలాపురం టౌన్: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ కాకుండా కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి మరీ అడ్డుకోవాలని వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి అన్నారు. ఈ మేరకు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు అమలు చేసి తీరాలని ఆయన డిమాండ్ చేశారు. అమలాపురంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా కన్వీనర్ దంగేటి రామకృష్ణ అధ్యక్షతన శనివారం జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ మూర్తి మాట్లాడారు. విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం కాకుండా కాపాడతామని, రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బ తీయకుండా కలిసికట్టుగా పనిచేస్తామని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు హామీలు ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు ప్రధాన మంత్రి మోదీతో ఉమ్మడిగా భేటీ అయ్యి విశాఖ ఉక్కు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరణ కాకుండా ఆపాలన్నారు. సమావేశంలో పార్టీ కిసాన్ మోర్చా కన్వీనర్ కొనుకు వెంకటేశ్వరరావు, అమలదాసు కృష్ణవేణి, పితాని బేబీరావు, పాలమూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దినోత్సవం



సీహెచ్ గున్నేపల్లిలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ముమ్మిడివరం: సీహెచ్ గున్నేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పాఠశాల హెచ్‌ఎం బి.బాబురావు అధ్యక్షతన శనివారం హిందీ దినోత్సవం జరిగింది. హిందీ భాష యొక్క ఆవశ్యకతను, గొప్పతనాన్ని పలువురు ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కేసీహెచ్ విశ్వనాథ్, పి.రత్తయ్య, టి.నాగమణి, కె.కృపానందం, ఏవీవీఎస్ మూర్తి, ఎ.రత్నాజీ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం పట్టణ సీఐగా వీరబాబు



అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ సీఐగా పి.వీరబాబు శనివారం ఉదయం పట్టణ పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం అమలాపురం రూరల్ సర్కిల్ సీఐగా పనిచేసిన వీరబాబు బదిలీపై పట్టణ సీఐగా వచ్చారు. ఈ సందర్భంగా పట్టణ ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది ఆయనను కలిసి అభినందించారు. అనంతరం ఆయన జిల్లా ఎస్పీ కృష్ణారావు, ఏఎస్పీ ప్రసాద్‌లను మర్యాద పూర్వకంగా కలిశారు. సీఐ వీరబాబు కోనసీమలో అంబాజీపేట, పి.గన్నవరం ఎస్‌ఐగా పనిచేయడంతో పాటు అమలాపురం రూరల్ సర్కిల్ సీఐగా పనిచేసిన అనుభవముంది. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తొలి ప్రాధాన్యమిస్తానని సీఐ వీరబాబు చెప్పారు. ఇప్పటి వరకూ పట్టణ సీఐగా పనిచేసిన కె.క్రిస్టోఫర్‌కు ప్రస్తుతానికి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ఆయనను మంగళగిరి పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు రిపోర్టు చేయాలని ఆదేశాలు వచ్చాయి.

నేటి నుంచి ఉరుసు ఉత్సవాలు

ముస్తాబైన కొత్తలంక బాబా దర్గా



కొత్తలంక బాబా దర్గా

ముమ్మిడివరం: హిందూ, ముస్లిం మత విభేదాలు అక్కడ మచ్చుకైనా కానరావు. ఎవరి మతాచారం ప్రకారం వారు బాబాకు పూజలు నిర్వహిస్తారు. కొత్తలంకలో హజరత్ హయత్ అహ్మద్ అలీషా ఖాదర్ వలీబాబా దర్గా దగ్గర ఈ అపురూప దృశ్యం కనిపిస్తుంది. ఈ దర్గాకు దేశం నలుమూలల నుంచి భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆదివారం నుంచి మూడు రోజుల పాటు ఉరుసు ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉరుసు ఉత్సవాలకు వేలాది మంది హిందూ, ముస్లిం భక్తులు వచ్చి బాబా దర్గాను దర్శించుకుంటారు. నల్గొండ జిల్లా గొల్లేపల్లి మండలం వలికొండ గ్రామానికి చెందిన బాబా 1818లో జన్మించారని సమాధి వద్ద లభ్యమైన సమాచారాన్ని బట్టి తెలుస్తుంది. నైజాం నవాబుల కాలంలో మూసీ నదికి వచ్చిన వరదల సమయంలో బాబా కోనసీమలో ప్రముఖ శైవక్షేత్రమైన కుండలేశ్వరం వచ్చారని పూర్వీకులు చెబుతారు. అనంతరం కొత్తలంక గ్రామంలో నివాసం ఏర్పాటు చేసుకొని కొత్తలంక బాబాగా ఖ్యాతి పొందారు. నగ్న శరీరంతో మౌనంగా ఉండే బాబా బోధనలకు కొత్తలంక నివాసి గేదెల వెంకటరత్నం కుటుంబ సభ్యులు ఆకర్షితులై ఆయనకు సపర్యలు చేస్తూ పూజించేవారు. నీళ్లపై నడవడం, వర్షంలో తడవకపోవడం వంటి మహిమలను అప్పటి ప్రజలు స్వయంగా చూసేవారని ప్రతీతి. 1948 జనవరి 22న బాబా తనదేహాన్ని త్యజించారు. 1953లో బాబా సమాధిపై దర్గాను నిర్మించారు. ఏటా ఈ సమాధి వద్ద వెంకటరత్నం వారసులు ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఉరుసు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గంధం పూయుట, సోమవారం దీపారాధన, మంగళవారం ‹జియారత్› కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉరుసు ఉత్సవాల్లో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం ఉచిత భోజనం, వసతి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు దర్గా నిర్వాహకులు గేదెల రఘునాథ బాబా తెలిపారు. దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించడంతో పాటు ఉరుసు ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశామన్నారు.

ఆకట్టుకున్న కూరగాయల వర్తకుల కోలాటం



అమలాపురంలో కూరగాయల వర్తకులు చేస్తున్న కోలాట ప్రదర్శన

అమలాపురం టౌన్: స్థానిక కూరగాయల మార్కెట్ వర్తకుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక కూరగాయల మార్కెట్‌లో నెలకొల్పిన వినాయక చవితి చలువ పందిరిలో శనివారం రాత్రి ప్రదర్శించిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. మార్కెట్‌కు చెందిన కూరగాయల వర్తకులు స్వతహాగా నేర్చుకుని కోలాట ప్రదర్శన చేశారు. 75 ఏళ్లుగా కూరగాయల మార్కెట్‌లో వినాయక చవితి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఇటీవల కాలంలో కూరగాయల వర్తకులు కోలాటంలో శిక్షణ పొంది చలువ పందిరిలో ప్రదర్శించడం ఆనందంగా ఉందని వర్తకులు అన్నారు.

లోక్ అదాలత్‌లో 322 కేసుల పరిష్కారం



అమలాపురంలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జిల్లా రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి నరేష్

అమలాపురం టౌన్: అమలాపురం కోర్టుల సముదాయంలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 322 కేసులు పరిష్కారం అయ్యాయి. అమలాపురం జిల్లా రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ వి.నరేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ లోక్ అదాలత్‌లో కక్షిదారులు రాజీ ద్వారా కేసులను పరిష్కరించుకున్నారు. పరిష్కారమైన 322 కేసుల్లో 30 సివిల్ కేసులు, 236 క్రిమినల్ కేసులు, 12 బీఎస్ఎన్ఎల్ కేసులు, 11 బ్యాంక్ కేసులు, 33 రోడ్డు ప్రమాదాల కేసులు ఉన్నాయి. మొత్తం రూ.3,46,33,672 విలువైన కేసులు పరిష్కారమయ్యాయి. వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న రాజీ పడతగ్గ కేసుల్లో మాత్రమే రాజీ ద్వారా పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అదాలత్‌కు విశేష స్పందనతో వందలాది మంది కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంతో రాత్రి 7.30 గంటల వరకూ సాగింది. లోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి ఎ.సాయికుమారి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గౌరీశంకరరావు, అదాలత్ సభ్యులైన న్యాయవాదులు, పోలీసు అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.

వినాయకుడికి శత సహస్ర గరిక పూజ



వేట్లపాలెంలో గణపతికి శత సహస్ర గరిక పూజ చేస్తున్న మహిళలు

కాట్రేనికోన: మండలంలోని వేట్లపాలెంలో కొలువుదీరిన వరసిద్ధి వినాయకుడికి బ్రహ్మశ్రీ ఆకొండి అంజి ఆధ్వర్యంలో శత సహస్ర గరిక పూజను శనివారం నిర్వహించారు. గణపతి నవరాత్రుల సందర్భంగా చలువ పందిరిలో ప్రత్యేక పూజలందుకున్న గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నాన్‌నీట్‌లో యానాం విద్యార్థినికి ప్రథమ ర్యాంక్



తన్మయి

యానాం: 2024–25 విద్యాసంవత్సరానికి గాను నాన్ నీట్ కోర్సుల్లో యానాంకు చెందిన ఇండుగుల తన్మయి పుదుచ్చేరి రాష్ట్రస్థాయిలో జనరల్ కేటగిరిలో ప్రథమ ర్యాంకు సాధించింది. ఈ మేరకు 98.47 స్కోర్‌ను సాధించిన తన్మయి శనివారం సెంటాక్ సంస్థ విడుదల చేసిన జాబితాల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. ఆమెకు పుదుచ్చేరిలో రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వెటర్నరీ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ కళాశాలలో సీటు లభించింది. ఈ సందర్భంగా తన్మయిని పలువురు అభినందించారు.

డిపాజిట్ల సేకరణ మాసోత్సవం



అమలాపురంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డీసీసీబీ అధికారులు, ఉద్యోగులు

అమలాపురం టౌన్: జిల్లా సహకార కేంద్ర బ్యాంక్(డీసీసీబీ) కోనసీమ అధికారులు, ఉద్యోగులు డిపాజిట్ల సేకరణ మాసోత్సవాన్ని అమలాపురం డీసీసీబీ బ్రాంచ్ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించారు. అమలాపురంలో డీసీసీబీ డిపాజిట్ల సేకరణ, వాటి వల్ల చేకూరే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తూ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక డీసీసీబీ బ్రాంచి కార్యాలయం నుంచి ర్యాలీ బ్యాంక్ స్ట్రీట్, కూచిమంచి అగ్రహారం, ఎస్‌కేబీఆర్ కాలేజీ రోడ్డు, హైస్కూలు రోడ్డు, గడియారం స్తంభం సెంటరు మీదుగా దాదాపు రెండు కిలోమీటర్ల మేర సాగింది. ఈ సందర్భంగా అమలాపురం డివిజన్ డీసీసీబీ హెడ్ యెలిశెట్టి రమేష్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. నోడల్ ఆఫీసర్లు కేఎస్‌వీఎస్ఎన్ మూర్తి, పి.శ్రీనివాస్, కె.ఆనందకుమార్, టి.శ్రీనివాస్, అమలాపురం బ్రాంచి మేనేజర్ పి.స్వర్ణ తదితరులు ఇంటింటికీ వెళ్లి డీసీసీబీ ఫిక్స్‌డ్ డిపాజిట్లు, చిన్న మొత్తాల పొదుపు, రికరింగ్ డిపాజిట్లపై అవగాహన కల్పిస్తూ వాటిపై విస్తృత ప్రచారం చేశారు. బంగారు ఆభరణాలపై రుణ సౌకర్యం, సేఫ్ లాకర్లు, రైతు నేస్తం పథకం ద్వారా సులభ వడ్డీ రేట్లతో సులభ వాయిదాలతో చెల్లించే విధానాలపై అవగాహన కల్పించారు.

వరద బాధితులకు టార్పాలిన్ల అందజేత

ఐ.పోలవరం: మండలంలో కేశనకుర్రులో ఇటీవల వరదలకు నిరాశ్రయులైన బాధితులకు జిల్లా రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ పిన్నమరాజు వెంకటపతిరాజు టార్పాలిన్లు, ఐజనిక్ కిట్లను శనివారం అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు ఇందుకూరి రంగరాజు, మోకా రవికుమార్, ఎంఎస్ఎన్ రాజు, పి.సుబ్బరాజు, వీఆర్వో శ్రీను బాబు, ఎంపీటీసీ చెల్లి రమాదేవి, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాక్‌డోర్ నియామకాల జాబితా ఇవ్వండి

యానాం: హైకోర్టు ఆదేశాలను ధిక్కరించి యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ రీజియన్లలో పబ్లిక్ వర్క్స్ తదితర 52 శాఖల్లో నిబంధనలకు విరుద్ధంగా దొడ్డిదారిన చేసిన నియామకాల జాబితాను అందజేయాలని మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్ఎం సుబ్రమణి శనివారం ఆదేశించారు. రిజర్వేషన్ ప్రక్రియను పాటించకుండా నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు చేశారంటూ పలువురు కోర్టును ఆశ్రయించడంతో ఈ మేరకు కోర్టులో పూర్తి స్థాయి విచారణ చేపట్టారు. చట్టవిరుద్ధంగా నియామకం చేసిన వారిని తక్షణం తొలగించాలని వారి వివరాలను కోర్టుకు అందజేయాలని ఆదేశించించారు. 16 లక్షల జనాభా ఉన్న పుదుచ్చేరిలో ఉద్యోగ రాత పరీక్ష ఏ విధంగా చేపట్టాలో తెలియడం లేదా అని ప్రశ్నించారు. దీనివల్ల నిరుద్యోగులు అన్యాయానికి గురవుతున్నారని, అక్రమ నియామకాల విషయంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.